క్లుప్తంగా

భరత్‌రామ్ విజయం ఖాయం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో టీడీపీకి కౌంట్‌డౌన్ మొదలైందని, ఎమ్మెల్యేగా మార్గాని భరత్‌రామ్ విజయం సాధించబోతున్నారని మాజీ ఎమ్మెల్యే, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీగా భరత్‌రామ్ నగరాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ప్రజల మధ్యనే ఉంటూ, వారి కష్టనష్టాలలో పాలుపంచుకుని, ఒక కుటుంబ సభ్యుడిలా కలిసిపోయారన్నారు. దివంగత వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధి, మళ్లీ ఇన్నాళ్లకు సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ, ప్రోత్సాహంతో ఎంపీ భరత్ రామ్ చేసి చూపారన్నారు. నగరాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారన్నారు.

గణిత శాస్త్ర సిలబస్ నిర్ధారణ సమావేశం

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 2024 – 25 విద్యా సంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్ విభాగంలో గణితశాస్త్రం సిలబస్‌ను నిర్ధారించేందుకు బోర్డు ఆఫ్ స్టడీస్ మీటింగ్ శనివారం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ఆదేశాల మేరకు గణితశాస్త్ర విభాగాధిపతి గోకవరపు చంద్రశేఖర్ ఈ సమావేశం చైర్మన్‌గా వ్యవహరించారు. పిఠాపురం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి యూనివర్సిటీ నామినీగా ఉన్నారు. అమెరికాలో సేల్స్ ఫోర్స్ కంపెనీ ప్రొడక్ట్ సెక్యూరిటీ లీడ్‌గా పనిచేస్తున్న గొల్లపూడి రవిశంకర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు, గణిత శాస్త్ర అధ్యాపకులు పాల్గొని పలు సూచనలు చేశారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక బస్సులు

సీటీఆర్ఐ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ సిబ్బంది రాజమహేంద్రవరానికి చేరుకునేందుకు ఆయా మండలాల హెడ్ క్వార్టర్ల నుంచి ఆదివారం ఉదయం 5 గంటలకు బస్సులు బయలుదేరతాయని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది కోసం నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం, చాగల్లు, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం, సీతానగరం, కోరుకొండ, గోకవరం, రాజానగరం, రంగంపేట, అనపర్తి, బిక్కవోలు, కడియం బస్సుస్టేషన్లు /బస్ షెల్టర్ల నుంచి ఉదయం 5 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. సిబ్బంది డ్యూటీ ఉత్తర్వులు చూపించి ఆ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల విధులకు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో మెగా పోస్టర్స్ చెక్

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు తెలిపారు. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో శనివారం మెగా పోస్టర్స్ చెక్ నిర్వహించారు. ఈ సందర్భంగా 604 కేసులు నమోదు చేసి, రూ.3.64 లక్షలను జరిమానాలు విధించారు. 28 రైళ్లలో తనిఖీలు నిర్వహించి టికెట్ లేని ప్రయాణికులు, నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలలో 45 మంది ట్రైన్ టికెట్ చెకింగ్ అధికారులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్ల రైతులను ఆదుకుంటాం

రాజమహేంద్రవరం సిటీ: ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో కోళ్ల రైతులను ఆదుకుంటామని, వారికి ఇచ్చే సబ్సిడీలను పునరుద్ధరిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆమె మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కొన్ని ప్రాంతాలలో కోళ్ల పెంపకంపై ఆధారపడిన రైతులు తమ సమస్యలను తెలిపారన్నారు. వారికి ఆదుకునే బాధ్యత ఎన్‌డీఏ తీసుకుంటుందన్నారు.

మహిళల కోసం మోడల్ పోలింగ్ స్టేషన్లు

రాజానగరం: మహిళా ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వారికి ఉపయోగపడేలా నియోజవర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఏడు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత తెలిపారు. మండలంలోని లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో సాధారణ ఓటర్లు, మహిళల కోసం ఏర్పాటు చేసిన రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను శనివారం ఆమె ప్రారంభించారు. ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసే మోడల్ పీఎస్ (147)తో పాటు మహిళ కోసం నియోజకవర్గానికి ఒక మోడల్ పీఎస్ (145)ను ఏర్పాటు చేశామన్నారు.

ప్రత్యేక అలంకరణ

లాలాచెరువు హెచ్‌బీ కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాల భవనాలలో ఏర్పాటు చేసిన ఈ రెండు పోలింగ్ కేంద్రాల వద్ద లోపల, బయట పండగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా సర్వాంగ సుందరంగా అలంకరించారు. ముఖద్వారాలను బెలూన్లతో అలంకరించి, లోపల గులాబీ రంగు కర్టెన్లు, టేబుల్ క్లాత్‌లతో సెట్టింగ్ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి తాగునీరు, వైద్య సదుపాయాలను కూడా అందుబాటులో ఉంచారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన పీఎస్ 145 పరిధిలో 578 మంది మహిళలు, 527 మంది పురుషులు, అలాగే 147 పీఎస్ పరిధిలో 590 మంది మహిళలు, 518 మంది పురుషులు ఉన్నారని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



శాటిలైట్ సిటీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణు, డాక్టర్ శ్రీనివాస్, పిల్లి సుబ్రహ్మణ్యం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- శాటిలైట్ సిటీలో ఎన్నికల ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 59 నెలల కాలంలో పేదలకు అందించిన సంక్షేమం, గ్రామాల్లో చేసిన అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లూ వేయాలని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పిల్లి సుబ్రహ్మణ్యంతో కలిసి శనివారం శాటిలైట్ సిటీ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా వీరిని పార్టీ శ్రేణులు భారీ గజమాలతో సత్కరించాయి. మంత్రి వేణు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కుట్రలు, కుతంత్రాలు చేసి పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకు పింఛన్ పంపిణీ జరగకుండా అడ్డుకున్నారన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల శాటిలైట్ సిటీ గ్రామాన్ని దత్తత తీసుకుని చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. తాను వచ్చిన మూడు నెలల కాలంలోనే గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సోమవారం జరిగే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా వేణుగోపాలకృష్ణను గెలిపించాలని కోరారు. పిల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వేణుగోపాలకృష్ణ, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పిల్లి సిరిబాల, రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల పాల్గొన్నారు.

జగన్ పాలనలో పేదరికం తగ్గుముఖం

- సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్
- ఎంపీ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రంలో పేదరికం తగ్గుముఖం పట్టిందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిలక్ రోడ్డులోని డాక్టర్ గూడూరి కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఏవీ అప్పారావు రోడ్డు, లాలా చెరువు, సీటీఆర్ఐ సెంటర్, క్వారీ మార్కెట్, బ్రదరన్ చర్చి, మార్కెట్ యార్డ్, పేపర్ మిల్లు, సీతంపేట, గోకవరం బస్టాండ్ జంక్షన్, దేవీచౌక్, ఆజాద్ చౌక్, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు మీదుగా కొనసాగింది. ఈ ర్యాలీకి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పలుచోట్ల మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని, మహిళా సాధికారతకు కృషి చేశారన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచారని అన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి ప్రజలలో ఆదరణ లేదని, రానున్న ఎన్నికలలో ఈ కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ర్యాలీలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పరిశీలకులు రావిపాటి రామచంద్రరావు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సతీమణి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, రాష్ట్ర లిడ్ క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ తగరం సురేష్ బాబు, ఇన్నీస్‌పేట అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, అజ్జరపు వాసు, నక్కా శ్రీనగేష్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్, ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, చిత్రంలో రౌతు సూర్యప్రకాశరావు

నిబద్ధతతో ఎన్నికల విధులు

సీటీఆర్ఐ: పోలింగ్, వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణ బాధ్యతలను ఆయా బృందాలు నిబద్ధతతో నిర్వర్తించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం పీడీఎంఎస్, వెబ్ కాస్టింగ్ బృందాలతో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులుతో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆరు నెలలుగా ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. నేడు అత్యంత కీలకమైన దశకు చేరుకున్నామన్నారు. పోలింగ్ రోజు సరళి, వెబ్ కాస్టింగ్ తదితర బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కార్యకలాపాల పురోగతి, వాటి వివరాలు, పోలైన ఓట్ల ప్రగతి, సెక్టార్ వారీగా పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, పోలింగ్ అధికారుల లాగిన్, డ్యాష్ బోర్డు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడం జరిగిందన్నారు. వీటిపై ఎటువంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేస్తామన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు హాజరవ్వాలని, సోమవారం ఉదయం పోలింగ్ రోజున ఉదయం 5 గంటలకి రిపోర్ట్ చేసి, మంగళవారం అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి మెటీరియల్ తరలింపు పూర్తయ్యే వరకూ బాధ్యత వహించాలన్నారు. సమయ పాలన విషయంలో కచ్చితత్వం పాటించాలని, ఆదేశాలు పాటించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడు నియోజక వర్గాలకు ఏడు బృందాలను నియమించామని, ఆయా బృందాలు నియోజక వర్గాల వారీగా సమన్వయం చేసుకోవడం, సెక్టార్ అధికారులతో సంప్రదించి డేటా ఎంట్రీ వివరాలు పరిశీలన చేయడం వంటివి నిర్వర్తించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేశామని రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని నేక్ హాస్టల్ భవనంలో ఆదివారం ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామన్నారు. 267 పోలింగ్ కేంద్రాల్లో అన్నిచోట్లా వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తామన్నారు. రాజమండ్రి శంభూనగర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనంలోని 186 నంబర్ బూత్‌ను మోడల్ పోలింగ్ కేంద్రంగా, కొంతమూరు చెంచుకాలనీ ఎంపీపీ యూపీ స్కూల్‌లోని 31 నంబర్ బూత్‌ను మహిళా పోలింగ్ కేంద్రంగా, పొట్టిలంక ఎంపీపీ యూపీ స్కూల్ 236 బూత్‌ను దివ్యాంగ ఓటర్ల కోసం ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2,558 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.

పూర్తయిన ఏర్పాట్లు

కడియం: ఎన్నికల పోలింగ్ కు మండలంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమయ్యే పోలింగ్‌కు మండల వ్యాప్తంగా 78 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి లోపల, బయట 156 సీసీ కెమెరాలు బిగించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆయా కేంద్రాల వద్ద సౌకర్యాలను ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ శనివారం పరిశీలించారు. ఇప్పటికే ఓటర్లందరికి సంబంధిత బూత్ లెవెల్ అధికారుల (బీఎల్వో) ద్వారా ఓటర్ స్లిప్పులను అందజేశామన్నారు. రూరల్ నియోజకవర్గంలో 264 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు.



వేమగిరిలో పోలింగ్‌బూత్ వద్ద ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరా

జగన్‌తోనే ప్రజలకు ఆర్థిక భరోసా

- అధికారం కోసం ప్రతిపక్షాల కుట్ర
- మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రజలకు ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబులతో కలిసి శనివారం మధ్యాహ్నం రాజవోలులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో సీఎం జగన్ మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేసి చూపించారన్నారు. సోమవారం జరిగే ఎన్నికలలో రెండు ఓట్లూ ఫ్యాన్‌గుర్తుపై వేసి తమను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు నక్కా శ్యాంబాబు, పెయ్యల రాజేష్, నక్కా రాజేంద్ర, పేట రామకృష్ణ, మట్టా వీర్రాజు, జుత్తుక వసంత్, అంగర శ్రీను, బూసి కృష్ణ, నరేష్, కన్నబాబు పాల్గొన్నారు.



రాజవోలులో ఓటర్లకు నమస్కరిస్తున్న మంత్రి వేణు, గూడూరి శ్రీనివాస్

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని, ఎమ్మెల్యేగా వేణుగోపాలకృష్ణ, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలపించాలని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న కోరారు. ఆయన శనివారం నియోజకవర్గంలోని పలు సంచారజాతులను కలిశారు. హుకుంపేటలో గగిరెద్దుల కులస్తులను, వేమగిరిలో ముస్లిం సంచార జాతులను, కోలమూరులో మందుల కులస్తులను, కొంతమూరు రాళ్లకొట్టే సాయిబులతో మాట్లాడారు. సోమవారం జరిగే పోలింగ్‌లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరారు. నాలుగేళ్లలో అమ్మ ఒడి, ఆసరా, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, హౌసింగ్, వాహన మిత్ర, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆసరా తదితర వాటి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్ పరిధిలోని 32 సంచార జాతులకు చెందిన 4.90 లక్షల మందికి రూ.1288.44 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో గంగిరెద్దుల కుల సంఘం నాయకులు మీసాల శ్రీను, ఉగ్గం శ్రీను, ముస్లిం సంచార జాతుల నాయకులు షేక్ జానీ, సయ్యద్ హేమమ్, మందుల కుల సంఘ నాయకులు పెండ్ర సత్తిరాజు, పెండ్ర పెదబాబు, వాడపల్లి వీర్రాజు, ఆసనాల ప్రసాద్ పాల్గొన్నారు.



సంచార జాతులతో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న

ప్రచారం.. సమాప్తం..

- మూగబోయిన మైకులు
- ఎన్నికల ప్రచారానికి తెర

సీటీఆర్ఐ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల రోజులకు పైగా హోరెత్తించిన మైకులు ఒక్కసారిగా మూగబోయాయి. ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం తెరపడింది. రాష్ట్రమంతా ఒక్కసారిగా ప్రశాంతంగా మారిపోయింది. హైదరాబాద్, తెలంగాణలో స్థిరపడిన ఏపీ ఓటర్లు పోలింగ్ కోసం తమ సొంతూర్లకు తరలివస్తున్నారు.

ఆంక్షలివే.. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఎన్నికలు ముగిసే వరకు పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.
- ఐదుగురికి మించి ఎక్కడైనా గుమిగూడితే చర్యలు తీసుకుంటారు.
- ఎన్నికలు ముగిసే వరకు రెండు రోజుల పాటు (మే 11 సాయంత్రం 5 నుంచి 13 సాయంత్రం 6 గంటల వరకు) వైన్ షాపులు, బార్లు మూసివేస్తారు. లిక్కర్ అమ్మకాలు నిషిద్ధం.
- పోలింగ్ ముంగిట ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతుంటాయి కాబట్టి పోలీసులు డేగ కన్ను వేస్తారు.
- ఎన్నికల ఊరేగింపులు, ర్యాలీలు, సినిమాలు, టీవీల ద్వారా ప్రచారం నిర్వహించడం నిషిద్ధం.
- మొబైల్ ఫోన్లలో ఎన్నికల సందేశాలను పంపించడం, ఒపీనియన్ సర్వేలు వెల్లడించడం నిషిద్ధం.
- ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే రెండేళ్ల జైలు శిక్ష, భారీ జరిమానా, ఒక్కోసారి రెండు విధించే అవకాశం ఉంటుంది.

50 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలను సోమవారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని 50 గ్రామాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి, అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలను 20 రూట్లుగా విభజించారు. 216 పోలింగ్ కేంద్రాలున్న ఈ నియోజకవర్గంలో పోలింగ్ విధుల కోసం 460 మందిని పీఓ, ఏపీఓలుగా, 904 మందిని ఓపీఓలుగా నియమించారు. వీరిని పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో పాటు తరలించేందుకు 60 బస్సులను ఏర్పాటు చేశారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కంబాలచెరువు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. జిల్లాకు వచ్చిన 1,700 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, 10 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు తీసుకోవాల్సిన చర్యలను శనివారం ఆయన వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంచి, వారి కదలికలను పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 1,098 రౌడీ షీటర్లను, 173 మంది ఓల్డ్ ఎలక్షన్ అఫెండర్లను బైండోవర్ చేశామని, 178 లైసెన్సుడ్ వెపన్స్ స్వాధీన పరుచుకున్నామన్నారు.